సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 2 । మే । 2023



నకిలీ ఇన్సూరెన్స్ కేసులో ఒకరి అరెస్ట్

నకిలీ ఇన్సూరెన్స్ కంపెనీల పేరుతో సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న కాల్ సెంటర్ ఏజెంట్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆత్మహత్యాయత్నం

భర్త రెండో వివాహం చేసుకున్నాడని మనస్తాపంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆత్మహత్యకు యత్నించింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.94
రెండోరకం	రూ.50	రూ.72

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 471 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	430	547
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1477.72 కిలోలు

న్యూస్‌రీల్

మూడు కిలోల వెండి కవచం బహూకరణ



వెండికవచంతో దాతలు

తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో వీరభద్రస్వామి విగ్రహానికి వెండి కవచం బహూకరించారు. తంబళ్లపల్లె మిషన్ సిద్దారెడ్డి, సుజాత దంపతుల కుమారుడు మదనపల్లె ఆధ్య కిడ్నీ కేర్ సెంటర్ డాక్టర్లు సనత్‌రెడ్డి, సీహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పావని దంపతులు సోమవారం మల్లయ్యకొండను సందర్శించారు. వీరభద్రస్వామి విగ్రహానికి సుమారు మూడు కిలోల బరువుతో వెండి కవచం మూడు లక్షల రూపాయలకుపైగా విలువ చేసే కవచాన్ని బహూకరించారు. దాతల కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి, ఈఓ రమణ, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలు అభినందించారు.

అంజన్నను దర్శించుకున్న కేరళ హైకోర్టు చీఫ్ జస్టిస్



ఆలయం వద్ద కమిటీ సభ్యులతో కేరళ హైకోర్టు జస్టిస్ ఎస్.భట్

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం బీటీ కాలేజీ మైదానం సమీపంలోని వరాల ఆంజనేయస్వామిని సోమవారం కేరళ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎస్.భట్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు సాయిస్వామి ఆలయ విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో టు టౌన్ సి.ఐ మురళీకృష్ణ, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

227 పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్ల నియామకం

రాయచోటిటౌన్ : అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా మొదటి విడత కింద 227 పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. నాడు – నేడు పథకం ద్వారా పాఠశాలలో 10 అంశాలపై మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఇలాంటి పాఠశాలలు జిల్లా వ్యాప్తంగా 227 ఉన్నాయని పేర్కొన్నారు. నియామక ఉత్తర్వులు పొందినవారు ఈ నెల 1వ తేదీ నుంచి విధుల్లో చేరినట్లు ఆయన తెలిపారు.

ఐఏఎల్ జిల్లా సహ అధ్యక్షుడిగా ఈశ్వర్



ఈశ్వర్, ఖాదర్‌బాషా

రాయచోటి అర్బన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లా అఖిల భారత న్యాయవాదుల సమాఖ్య (ఐఏఎల్) సహ అధ్యక్షుడిగా రాయచోటికి చెందిన టి.ఈశ్వర్, సహ కార్యదర్శిగా మిఠాయిగిరి ఖాదర్‌బాషా ఎంపికయ్యారు. కడప ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఆదివారం జరిగిన ఐఏఎల్ 6వ జిల్లా మహాసభలో తమ ఎంపిక జరిగిందన్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కడపకు చెందిన సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శిగా మారుతి రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా నాగసుబ్బారెడ్డి, సహకార్యదర్శులుగా ముజఫర్, ఆనంద్, రామకొండయ్య, అమీన్ పీర్, అనంత, వెంకటశివలు ఎంపికయ్యారు.


శిల్పారామాల రాష్ట్ర ఏఓగా మునిరాజు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ మునిరాజు శిల్పారామాల రాష్ట్ర స్థాయి పాలనాధికారిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం కడప శిల్పారామంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా సేవలు అందించిన ఆయన సుదీర్ఘ పాలన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర శిల్పారామాల సీఈఓ డి.శ్యామసుందర్‌రెడ్డి మునిరాజును శిల్పారామాల రాష్ట్ర ఏఓగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప శిల్పారామానికి కొత్త హంగులు కల్పించేందుకు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న విజయనగరం, పుట్టపర్తిలలోని శిల్పారామాలను త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

కేజీ సెట్ 2కే22 పరీక్షకు విశేష స్పందన

కడప ఎడ్యుకేషన్ : కడప కేఎస్‌ఆర్‌ఎం, కేఎల్‌ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు నిర్వహించిన కేజీసెట్ 2కే23 ఆన్‌లైన్ పరీక్షకు విశేష స్పందన లభించింది. వివిధ జిల్లాల నుంచి 967 మంది పరీక్షకు హాజరయ్యారు.

మనిషి ఇక్కడ — మనసు అక్కడ



- బీజేపీలో ఉంటూ చంద్రబాబు భజన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆది
- బీజేపీ, జనసేన, టీడీపీ పొత్తుల వ్యాఖ్యలపై అధిష్టానం సీరియస్
- వివాదాస్పద వ్యాఖ్యలతో తెగదెంపులు చేసుకోవాలనే ఉబలాటం
- ప్రొద్దుటూరు టీడీపీ టికెట్‌పై పెట్టుకున్న ఆశే కారణం

సాక్షి ప్రతినిధి, కడప : పేరుకు కాషాయ కండువా కప్పుకున్నా.. మనసు మాత్రం పచ్చ పార్టీ గురించే ఆలోచిస్తుంది. చంద్రబాబుకు జై కొట్టే అతి కొద్దిమంది బీజేపీ నేతల్లో ముందు వరుసలో మాజీ ఎమ్మెల్యే దేవగుడి ఆదినారాయణరెడ్డి నిలుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ విస్తరించాలనే ఉద్దేశం కంటే టీడీపీ బలపడాలనే లక్ష్యం ఆయనలో బలంగా దాగి ఉంది. అందుకు అనుగుణంగానే రాజకీయ సమాలోచనలు ఉంటున్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. తాజాగా బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తాయని పొత్తులపై ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ అధిష్టానం సీరియస్ అయినట్లు తెలుస్తోంది. పార్టీ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం.

ఒకవైపు తాము జనసేనతో మాత్రమే పొత్తులో ఉన్నామని, టీడీపీతో కలిసి వెళ్లేది లేదని బీజేపీ అగ్రనేతలు చెబుతున్నారు. బీజేపీలోని చంద్రబాబు వర్గం నేతలు మాత్రం టీడీపీతో కలవడానికి అత్యధికంగా ఇష్టపడుతున్నారు. అడపాదడపా అదే విషయాన్ని తెరపైకి తెస్తూ తెలుగుదేశం పార్టీని రక్షించేందుకు తెరవెనుక సంకల్పం పుచ్చుకున్నారు. అలాంటి వారిలో జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, మాజీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ముందు వరుసలో నిలుస్తున్నారు. నిత్యం బీజేపీ భజన కంటే చంద్రబాబు భజనే పరిపాటిగా పెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ పటిష్టత ఎలా ఉన్నా, టీడీపీ బలపడాలనే తపన మెండుగా ఉండడమే అందుకు ప్రధాన కారణంగా రాజకీయ పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

కొరవడిన చిత్తశుద్ధి!

2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో ఘోర పరాజయం పాలైంది. టీడీపీ నుంచి కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆదినారాయణరెడ్డి సైతం భారీ ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. తెలుగుదేశం పార్టీ అధికారం కోల్పోయిన వెంటనే మాజీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాజ్యసభ సభ్యుడు సిఎం రమేష్ సైతం అదే బాట పట్టారు. అందుకు ప్రధాన కారణం కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడమే. అధికారం లేకపోతే రాజకీయ మనుగడ కష్టసాధ్యమనే భావనే వారిని బీజేపీలో చేరేలా చేసింది. వైఎస్సార్‌సీపీ జమ్మలమడుగు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆదినారాయణరెడ్డి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకునే క్రమంలో కుటుంబం యావత్తు ఆ పార్టీలో చేరారు. కాగా బీజేపీలో కేవలం ఆదినారాయణరెడ్డి మాత్రమే చేరి, కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీలో అలాగే కొనసాగేలా జాగ్రత్త పడ్డారు. ఇదే వైఖరిని రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ కూడా అవలంబించారు. ఎంపీగా బీజేపీ జాతీయ నేతలతో నిత్యం టచ్‌లో ఉంటూనే కుటుంబాన్ని టీడీపీలో కొనసాగిస్తున్నారు. బీజేపీ పట్ల వీరికి ఉన్న చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా నిలుస్తోంది.

రాబోవు రోజుల్లో మరింత వివాదాస్పదం..

భారతీయ జనతా పార్టీలో క్రమశిక్షణ పాళ్లు అధికం. అరువు తెచ్చుకున్న నాయకుల కారణంగా ఆ పార్టీలో కూడా క్రమశిక్షణ లోపించింది. ఎన్నికల గడువు సమీపించే కొద్ది బీజేపీ నేతల నుంచి వివాదాస్పద వ్యాఖ్యలు అధికం కానున్నాయి. అదే అభిప్రాయాన్ని రాజకీయ విశ్లేషకులు సైతం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు గురించి మాజీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలు కూడా అందులో భాగంగానే భావించాల్సి వస్తోంది. ఇప్పటికే జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే ఆది సోదరుడి కుమారుడు భూపేష్‌రెడ్డి కొనసాగుతున్నారు. టీడీపీ టికెట్ ఆశిస్తున్నారు. అక్కడ కుటుంబాన్ని అలాగే కొనసాగించి, ప్రొద్దుటూరు టీడీపీ టికెట్ కేటాయించాలని తెరవెనుక మంత్రాంగాన్ని మాజీ ఎమ్మెల్యే ఆది నడుపుతున్నట్లు సమాచారం. ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గం తమ స్వగ్రామం దేవగుడికి సమీపంలోనే ఉండడం, ప్రొద్దుటూరు పట్టణం, రూరల్, రాజుపాళెం మండలాలు మాత్రమే విస్తరించి ఉండడం, పలువురితో ప్రత్యక్ష సంబంధాల దృష్ట్యా ఆ సీటును ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమేరకే బీజేపీ నాయకత్వంతో నిమిత్తం లేకుండా వివాదాస్పద నిర్ణయాలు, అభిప్రాయాలు తెరపైకి తెస్తున్నారు. రాబోవు రోజుల్లో మరింతగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం, కుదిరితే టీడీపీ, జనసేన, బీజేపీల పొత్తు.. లేదంటే బీజేపీతో తెగదెంపులు చేసుకోవడమే ఆదినారాయణరెడ్డి అసలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఆర్టీసీకి పూర్వ వైభవం తీసుకొస్తాం



ఎలక్ట్రిక్ బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

- ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి
- ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభించిన ఆర్టీసీ చైర్మన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ఆర్టీసీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం కడప ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న గ్యారేజీ ప్రాంతంలో 12 ఎలక్ట్రిక్ బస్సులను చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశ పెడుతోందన్నారు. అందులో భాగంగా ఏపీఎస్ ఆర్టీసీ అలిపిరి డిపోకు 100 ఎలక్ట్రికల్ బస్సులను కేటాయించిందన్నారు.వీటిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెప్టెంబరు 27వ తేదీన తిరుమల–తిరుపతి మధ్య ప్రారంభించారన్నారు. తిరుమల–రేణిగుంట మధ్య 14 బస్సులు, తిరుపతి–మదనపల్లె 12, తిరుపతి–నెల్లూరు 12, తిరుపతి–కడప మధ్య 12 ఎలక్ట్రికల్ బస్సులను ప్రారంభించారన్నారు. త్వరలో మదనపల్లె–నెల్లూరు మధ్య బస్సులను కూడా ప్రారంభించనున్నట్లు చెప్పారు.కాలుష్య నివారణ, మెరుగైన ప్రయాణ సౌకర్యమే లక్ష్యంగా ఈ బస్సులు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ బస్సులు తిరుపతి నుంచి కడపకు 36 సింగిల్స్ తిరుగుతాయన్నారు. తిరుపతి నుంచి కడపకు పెద్దలకు రూ. 340, పిల్లలకు రూ. 260 ఛార్జీగా నిర్ణయించామన్నారు. ఉదయం 4.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఈ బస్సులు రాకపోకలు సాగిస్తాయన్నారు. వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను నడపనున్నామని, 1570 డీజిల్ బస్సులను కొనుగోలు చేయనున్నామన్నారు. 200 బస్సులను డీజిల్ నుంచి ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు కృషి జరుగుతోందన్నారు. ఇప్పటివరకు కొత్తగా 3700 బస్సులను తీసుకున్నామని వివరించారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 8500 ఆర్టీసీ బస్సులు తిరుగుతున్నాయన్నారు. కడపలో గ్యారేజీని రూ. 13 కోట్లతో నిర్మిస్తున్నామని, రెండు, మూడు నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కడప బస్టాండును అధునాతనంగా నిర్మించేందుకు ముఖ్యమంత్రి అనుమతుల కోసం వేచి చూస్తున్నామన్నారు. ప్రజలకు సరైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రాష్ట్రంలోని అన్ని డిపోల్లో త్వరలో ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో కడప జోన్ ఈడీ గోపినాథ్‌రెడ్డి, తిరుపతి, కడప ఆర్ఎంలు చెంగల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, హెవీ ట్రాన్స్ ప్రైవేటు లిమిటెడ్ జీఎం సందీప్, డిప్యూటీ సీఎంఈలు పి.లక్ష్మిభాస్కర్, ఇబ్రహీం, కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు, అలిపిరి డిపో మేనేజర్ హరిబాబు, ఏటీఎం జనార్దన్, సీఐలు గోవర్దన్‌రెడ్డి, కన్యాకుమారి, శ్రీలత, మహేశ్వర్‌రెడ్డి, యూనియన్ నాయకులు బాబా ఫక్రుద్దీన్, పురుషోత్తం, సగినాల శ్రీనివాసులు, ఏఆర్ మూర్తి, కేకే కుమార్ పాల్గొన్నారు.

తొలి రోజే 87.80 శాతం పింఛన్ల పంపిణీ



జి.కొత్తకోటలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

రాయచోటి : వేకువజాము నుంచే ప్రారంభమైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. సోమవారం మొదటి రోజునే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా 87.80 శాతం మందికి పింఛన్లు అందజేసి లబ్ధిదారుల నుంచి ప్రశంసలు పొందారు. జిల్లాలో 2,15,542 మంది పెన్షన్‌దారులకు రూ.59.46 కోట్లు మంజూరైంది. ఇందులో మొదటి రోజు రాత్రి 8 గంటల వరకు 1,89,237 మందికి రూ.52.16 కోట్లను పంపిణీ చేసినట్లు వెలుగు పీడీ సత్యనారాయణ, ఏపీడీ ధర్మరాజులు తెలిపారు. మిగిలిన వారికి కూడా మరో రెండు రోజుల్లో పూర్తిగా పంపిణీ చేస్తామని వారు చెప్పారు. జిల్లాలో జరుగుతున్న పెన్షన్ల పంపిణీ విధానాన్ని సోమవారం ఉదయం డీఆర్‌డీఏ పెన్షన్ డీపీఎం ధర్మరాజు పరిశీలించారు. వేలిముద్రల ఆధారంగా అందని వారికి కంటిచూపు ద్వారా గుర్తింపు చేసి అర్హులకు పెన్షన్లను అందజేశారు. ప్రతి నెల 1వ తేదీన ఠంచనుగా వలంటీర్లు పింఛన్ అందజేస్తుండటంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తు చేసుకోండి

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖ విభాగాల్లో ఏర్పడిన ఖాళీల భర్తీకి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. దరఖాస్తు నమూనా ఇతర వివరాలకు కడప.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తును వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని, సంబంధిత సర్టిఫికెట్స్ జతపరచాలన్నారు ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలలోగా కడపలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో హాజరు కావాలన్నారు.

అంగరక్షకులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



ఫిర్యాదును స్వీకరిస్తూ సమస్యపై మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గంగాధరరావు



పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో శిక్షణ పొందుతున్న పోలీస్ అంగరక్షకులు

జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

రాయచోటి : ఎలాంటి విపత్కర పరిస్థితిని అయినా అంచనా వేసి వాటిని ఎదుర్కొనేందుకు అంగరక్షకులు నిరంతరం సిద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు సూచించారు. సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్లకు మొదటి విడత శిక్షణా కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. జిల్లాలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, ఎస్పీ, అదనపు ఎస్పీలకు భద్రతగా ఉన్న పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్(పీఎస్ఓఎస్)లకు రాయచోటిలోని జిల్లా పోలీసు పెరేడ్ మైదానంలో పునఃశ్చరణ తరగతులను ప్రారంభించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఎప్పటికప్పుడు సాంకేతిక నైపుణ్యంతో తయారవుతున్న అత్యాధునిక ఆయుధాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. శిక్షణ నిర్వాహకులు ఏఆర్ డీఎస్పీ పి.మహబూబ్‌బాషా అంగరక్షకులకు విధి నిర్వహణలో పాటించాల్సిన మెలకువలను వివరించారు. ఏకే 47, ఎల్ఎంజీ, కార్బన్, ఇన్సాస్, 9 ఎంఎం పిస్టల్, గ్రెనేడ్ లాంటి అత్యాధునిక ఆయుధాలతో శిక్షణ ఇస్తూ మందుపాతరలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అంగరక్షకుల ఇన్‌చార్జి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.జావీద్, ఆర్ఎస్ఐలు రవి, అమరనాథరెడ్డి, మురుగన్, ఏఆర్ ఎస్ఐ గుణశేఖర్, అంగరక్షకులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలి

స్పందన కార్యక్రమం ద్వారా వస్తున్న ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా పోలీసు అధికారులను ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ «స్పందన» కార్యక్రమంలో బాధితులతో మాట్లాడి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమస్యలను తెలుసుకున్నారు. 48 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అలాగే నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఆదేశించారు.

సమస్యల సత్వర పరిష్కారమే స్పందన లక్ష్యం

కలెక్టర్ గిరీషా పీఎస్



వీడియో కాన్ఫరెన్సులో వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల విజ్ఞప్తులను కలెక్టర్ స్వీకరించారు. అర్జీల స్వీకరణలో డీఆర్ఓ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మలు పాల్గొన్నారు. స్పందనకు ప్రజల నుంచి అందే అర్జీలను నిశితంగా పరిశీలించి, ఆ అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఒకే సమస్యపై పరిష్కారం కోసం పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం సరికాదన్నారు. సమస్యను మన స్థాయిలో పరిష్కరించలేనప్పుడు అర్జీదారునికి వివరంగా తెలియపరచాలన్నారు. స్పందన అర్జీల పరిష్కారానికి సంబంధిత అధికారులంతా కొంత సమయం కేటాయించాలన్నారు.

వేదన వినవలె.. కరుణ చూపవలె

- వాల్మీకిపురం మండలం నగిరిమడుగుకు చెందిన సిద్దయ్య తన భూమిని ఇతరులు ఆన్‌లైన్ చేసుకున్నారని, వారి ఆన్‌లైన్ రద్దు చేసి తన పేరిట ఆన్‌లైన్ చేయాలని వినతిపత్రం అందజేశారు.
- లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గ్రామానికి చెందిన నాగేశ్వర సర్వే నంబర్ 255లో తనకు రావాల్సిన భాగం అందులో రీసర్వే సమయంలో తక్కువ విస్తీర్ణం చూపి నోటీసు ఇచ్చారన్నారు. తనకు న్యాయం చేయాలని కోరారు.
- సంబేపల్లి మండలం రౌతుకుంట గ్రామానికి చెందిన పెద్ద మల్లయ్య సర్వే నెంబర్362/బి2లో తన అనుభవంలో ఉన్న భూమిని ఇతరులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని, తనకు న్యాయం చేయాలని విన్నవించాడు.
- రామాపురం మండలం చిట్లూరు గ్రామం కొండవాండ్లపల్లెకు చెందిన నరసింహారెడ్డి తమ పల్లె దారికి అడ్డంగా ఓ వ్యక్తి మట్టి తోలారని, తద్వారా రోడ్డు సమస్య ఇబ్బందిగా ఫిర్యాదు చేశారు.
- చిన్నమండెం మండలం మల్లూరు గ్రామం గంగిరెడ్డిపల్లెకు చెందిన రవణమ్మ తన అనుభవంలో ఉన్న భూమికి సంబంధించి అడంగల్, 1బి, పాస్‌బుక్, ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్‌ను కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ సంఖ్యను పెంచాలి

ఇంటింటికి ఉచిత ఆరోగ్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆ దిశగా వైద్యాధికారులు వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో ఎన్‌సీడీ – సీడీసర్వే, అనీమియా, ఏఎన్ఎం ఫీడ్ బ్యాక్, కోవిడ్ టెస్టింగ్, కంటి వెలుగు తదితర అంశాలపై వైద్యాధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో జనరల్ ఓపీ సంఖ్యను గణనీయంగా పెంచడంతోపాటు ఎప్పటికప్పుడు డేటా ఎంట్రీ చేయాలన్నారు. కోవిడ్ లక్షణాలు ఉన్న వారికి రాపిడ్‌టెస్టు కాకుండా ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన పనులను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాలులో గ్రామవార్డు సచివాలయాలు, స్పందన, రీ సర్వే, హౌసింగ్ ఎన్నికలు తదితర అంశాలపై జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ఇతర జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ కార్డు మ్యాపింగ్‌లో ఉన్న లోపాలను సవరించాలన్నారు. సంపూర్ణ పోషణ కార్యక్రమానికి సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో ఈకేవైసీలను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.


చెల్లని ఓటరు కార్డులపై దృష్టి సారించాలి

ఎన్నికల కార్యక్రమంలో భాగంగా చెల్లని ఓటరు కార్డులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. కర్ణాటకలో జరుగుతున్న ఎన్నికలలో చెల్లని ఓటరు కార్డులు చాలా బయటపడ్డాయన్నారు. అలాంటివి మన జిల్లాలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పదో తేదీలోగా హద్దురాళ్లు నాటాలి

అన్నమయ్య జిల్లాలో ఈ నెల 10వ తేదీలోగా హద్దు రాళ్లు నాటే ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సర్వే శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం విజయవాడ నుంచి రాష్ట్ర సర్వే శాఖ కమిషనర్ సిద్ధార్థజైన్ జగనన్న భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా హద్దురాళ్ల పాతే అంశంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న భూహక్కు–భూరక్ష పథకం విజయవంతానికి చర్యలు చేపట్టాలని సూచించారు. మొదటిదశలో రీసర్వే పూర్తయిన 84 గ్రామాల్లో దాదాపు 70 వేలకు పైబడి హద్దురాళ్లు నాటే కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా సరైన కార్యాచరణ రూపొందించుకొని విజయవంతం చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ సత్యనారాయణ, సర్వే శాఖ జేడీ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పాలీసెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ సత్యనారాయణ రావు

రాయచోటిటౌన్ : ఈనెల 10వ తేదీన నిర్వహించే ఏపీ పాలీసెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కో ఆర్డినేటర్, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ రావు అధికారులకు సూచించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 10వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏపీ పాలీసెట్ ఎంట్రన్స్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని చెప్పారు. 11 గంటల తరువాత ఎలాంటి పరిస్థితిలో పరీక్ష కేంద్రంలోకి ప్రవేశం ఉండదని తెలిపారు. రాయచోటి, రాజంపేట, పీలేరు, మదనపల్లె, కలికిరి ప్రాంతాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. ప్రిన్సిపల్ శివశంకర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రానికి విద్యార్థులు తప్పకుండా గంట ముందుగా హాజరు కావాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 17 సెంటర్ల ద్వారా 4588 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖ అధికారులు హాజరయ్యారు.

ఉపాధి కూలీకి తీవ్ర గాయాలు


గాయపడ్డ శ్రీనివాసులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మల్లెల పంచాయతీ ఉప్పరవాండ్లపల్లికి చెందిన చిట్టిగాని శ్రీనివాసులు (47) అనే ఉపాధి కూలీ సోమవారం ప్రమాదవశాత్తూ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. శ్రీనివాసులు తన ద్విచక్ర వాహనంలో గడ్డపార పెట్టుకుని సమీపంలోని వలస గుట్టలో జరుగుతున్న ఉపాధి హామీ కూలి పనికి బయలు దేరాడు. ఈ తరుణంలో మార్గంమధ్యలోనే ప్రమాదవశాత్తు వాహనంలో ఉన్న గడ్డపార పక్కకు జరిగి వాహనం నడుపుతున్న అతడి కుడి కాలు తొడ భాగంలోకి లోతుగా దిగిపోయింది. నొప్పి అధికం కావడంతో గడ్డపారను తనే బలంగా బయటకు లాగేయడంతో తీవ్రమైన రక్తస్రావం అయింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన చికిత్స నిమిత్తం మదనపల్లి ఆసుపత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి..


తీవ్రంగా గాయపడిన బాలాజీ

కురబలకోట : మండల పరిధి అంగళ్లలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ప్రమాదవశాత్తు సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు పట్టణం రేవనపల్లెకు చెందిన బి.బాలాజీ (20) కురబలకోట మండలం అంగళ్లలోని పేరున్న కళాశాలలో ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం కళాశాల నుంచి మోటార్ సైకిల్‌లో హాస్టల్‌కు వస్తుండగా బాటసారిని తప్పించే క్రమంలో అదుపు తప్పి కింద పడ్డాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన మరో మోటార్ సైక్లిస్టు కిందపడిన బాలాజీని ఢీకొని వెళ్లిపోయాడు. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సహచర విద్యార్థులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వేలూరు ఆసుపత్రికి తరలించారు.

నకిలీ ఇన్సూరెన్స్ కేసులో ఒకరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న వైఎస్ఆర్ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : నకిలీ ఇన్సూరెన్స్ కంపెనీల పేరుతో సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న కాల్ సెంటర్ ఏజెంట్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గాజియాబాద్‌లోని వసుంధర ప్రాంతానికి చెందిన మేహ్కిన్ చౌహాన్‌ను కడప టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి మానిటర్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. ఈ సంఘటన వివరాలను కడపలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమ్మవారిశాల వీధిలో నివాసం వుంటూ బంగారుపని చేసుకుంటున్న గౌతంపాల్ అనే వ్యక్తికి రెండేళ్ల క్రితం జుహీ తన్వర్ పేరుగల గుర్తు తెలియని మహిళ ఒక కాల్ సెంటర్‌లో పని చేస్తూ అనురాధ అనే పేరుతో పరిచయం చేసుకుని ఇన్సూరెన్స్ మంచి రిటర్న్స్ వచ్చేవి వున్నాయనీ మాయమాటలు చెప్పి ఇన్సూరెన్స్ పాలసీ చేయించింది. ఏటీఎం కార్డు వివరాలను వాట్సాప్ ద్వారా తెప్పించుకుని ఆయన, అతని భార్య పేరు మీద మొత్తం 4 పాలసీలు చేయించారు. ఈ పాలసీలకు గాను రూ.3,87,000లను డబ్బులను కట్టారు. తరువాత వ్యక్తిగత డేటా, నిందితుల కాల్ సెంటర్‌లో పని చేసే వారికి చేర వేసి వారి ద్వారా మరలా గౌతంపాల్‌కు ఇన్సూరెన్స్ ఆఫర్స్ వచ్చాయని మభ్యపెట్టారు. ఆయన ద్వారా ఇన్సూరెన్స్ చేయించుటకు కొందరిని ఒప్పించి పెద్ద మొత్తంలో దాదాపు రూ.20 లక్షల వరకు వారి నకిలీ బ్యాంక్ అకౌంట్స్‌కు జమ చేయించుకున్నారు. వీరిని వెనుక వుండి నడిపించిన మేహ్కిన్ చౌహాన్ అనే వ్యక్తి ప్రజలకు సంబంధించిన పర్సనల్ డేటాను చోరీ చేసి ఒక నకిలీ కాల్ సెంటర్‌ను నడుపుతూ ఈ విధంగా నకిలీ పాలసీల వ్యవహారాన్ని చేశాడు. సుమారు రూ. 25 లక్షలు వరకు నకిలీ పాలసీలు గౌతంపాల్‌తో చేయించి ఏడాది తరువాత పెద్ద మొత్తంలో వస్తుందనీ చెప్పిన వారు, ఆ పాలసీల మెచ్యురిటీ సమయానికి పదేపదే వారికి ఫోన్‌లు చేసినా ఫలితం లేకపోయింది. తన చేత నకిలీ పాలసీలను చేయించి మోసం చేసినట్లుగా గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ఈ సంఘటనతో కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ లో కేసును ఏప్రిల్ 3న క్రైం నంబర్ 125/2023 కింద కేసు నమోదు చేశారు.

నేరపరిశోధన విధానం

ఈ కేసును జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని, కేసును ఛేదించేందుకు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్ పర్యవేక్షణలో కడప టూటౌన్ పోలీసులు రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసుకున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా ఫిర్యాది డబ్బు చెల్లించినటువంటి బ్యాంకు ఖాతాలు, ఫోన్‌కాల్స్ ఆధారంగా నిందితులు ఉపయోగించిన అకౌంటు వివరాలను సేకరించి, వాటి ద్వారా కేసు విచారణ చేశారు. నకిలీ పాలసీల ద్వారా మోసం చేస్తున్న ప్రధాన నిందితుడు మేష్కిన్ చౌహాన్‌ను కడప టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం ఉదయం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి మానిటర్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ నకిలీ పాలసీల వ్యవహారంలో మరి కొంతమంది పాత్ర వుందనీ ప్రస్తుతం అరెస్టయిన నిందితుడు పోలీసులకు తెలియజేశాడు. వారి కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరిపై దేశ వ్యాప్తంగా ఈ విధంగా నకిలీ పాలసీలు చేసినట్లు కాల్ డేటా ద్వారా తెలుసుకున్నామనీ, లోతుగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం, కడప సైబర్ క్రైమ్ సీఐ శ్రీధర్‌నాయుడు, టూటౌన్ ఎస్ఐ వై.జయరాములు, సైబర్ క్రైమ్ ఎస్ఐ మధుమల్లేశ్వర్ రెడ్డి, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న సులోచన

మదనపల్లె : భర్త రెండో వివాహం చేసుకుని మోసం చేశాడన్న మనస్తాపంతో చిత్తూరు జిల్లా చౌడేపల్లె ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.సులోచన(50) సోమవారం ఆత్మహత్యకు ప్రయత్నించింది. చౌడేపల్లె పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు, బాధితురాలి కథనం మేరకు... చౌడేపల్లె పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న డాక్టర్.జి.పవన్‌కుమార్‌తో ఏడేళ్ల క్రితం తనకు వివాహం జరిగిందని ఐసీడీయస్ సూపర్‌వైజర్ సులోచన చెప్పింది. ఈ క్రమంలో రెండురోజుల క్రితం తన భర్త పవన్‌కుమార్ చౌడేపల్లె మండలం చారాల సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రవల్లికను రెండో వివాహం చేసుకున్నాడని ఆరోపించింది. ప్రవల్లికతో చనువుగా ఉన్న విషయమై తమ దంపతుల మధ్య వివాదాలు ఏర్పడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు వరకు వెళ్లిందన్నారు. డాక్టర్ పవన్‌కుమార్‌తో తనకు ప్రేమ వివాహం జరిగిందని, తమ వివాహానికి సంబంధించి ఆధారాలు లేకుండా తన భర్త జాగ్రత్తపడ్డాడని సులోచన వివరించింది. అయితే ఈ విషయమై డాక్టర్ పవన్‌కుమార్‌ను వివరణ కోరితే తాను సులోచనను వివాహం చేసుకోలేదని, ఏడేళ్లుగా సహజీవనం చేస్తున్నట్టు చెప్పారు. సులోచనకు తనతో వివాహం జరిగినట్లుగా అందరికీ చెప్పుకుంటూ బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతోందని చెప్పారు. చౌడేపల్లె ఎస్ఐ రవికుమార్ మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చేరుకుని బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల నివారణ మందు తాగి..

మదనపల్లె : భర్త తనను పట్టించుకోవడం లేదని వివాహిత పురుగు నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన సోమవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. కోటవారిపల్లె పంచాయతీ కొండమీదపల్లెకు చెందిన భాస్కర్ భార్య జ్యోతి(23)ను పట్టించుకోకుండా ఇంటికి సక్రమంగా రాకపోవడంతో మనస్తాపం చెందింది. టమాట పొలానికి పిచికారీ చేసేందుకు ఇంట్లో తెచ్చి ఉంచిన పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు బాధితురాలిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం ఆమె కోలుకుంటోంది.

తల్లిదండ్రులు మందలించారని..

ములకలచెరువు : తల్లిదండ్రులు మందలించారనే మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని చౌడసముద్రం పంచాయతీ శెట్టివారిపల్లెకు చెందిన మధుసూదన్‌రెడ్డి భార్య శ్రావణి(29) భర్తకు చెప్పకుండా పిల్లలతో చౌడసముద్రంలోని పుట్టింటికి వెళ్లింది. భర్తకు చెప్పకుండా వచ్చిందని తల్లిదండ్రులు మందలించారు. ఇందుకు మనస్తాపం చెందిన శ్రావణి(29) పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా మదనపల్లి జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు. ములకలచెరువు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీరభద్రుడికి పల్లకీ సేవ

రాయచోటిటౌన్ : రాయచోటిలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించి పల్లకీలో ఊరేగించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈఓ డీవీ రమణారెడ్డి, పాలక మండలి సభ్యులు నాగభూషణం, సురేష్ బాబు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

మదనపల్లె : మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి వెంట తీసుకెళ్లిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ చంద్రమోహన్ చెప్పారు. పట్టణంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు చెందిన ఓ మైనర్ బాలిక(16)ను ఇటీవల అదే ప్రాంతానికి చెందిన లోకేష్ అనే యువకుడు ప్రేమ పేరుతో నమ్మించి బయటకు తీసుకెళ్లాడు. ఈక్రమంలో బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మైనర్ బాలిక అదృశ్యం కేసు నమోదు చేశారు. అనంతరం బాలిక ఆచూకీ కనుక్కుని వైద్యపరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. యువకుడిపై కిడ్నాప్, అత్యాచారం నేరారోపణలతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు.

108 వాహనంలో ప్రసవం


మగ బిడ్డను అందజేస్తున్న ఈఎంటీ అనిల్

పెద్దతిప్పసముద్రం : మండలంలోని గొడుగువారిపల్లికి చెందిన శ్రీనివాసులు భార్య సుధారాణికి పురిటి నొప్పులు రావడంతో 108 వాహనంకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో ఈఎంటీ అనిల్, పైలెట్ నరసింహులు మహిళను మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోని మొగసాలమర్రి వద్ద నొప్పులు అధికం కావడంతో సిబ్బంది చికిత్స అందించారు. సుఖ ప్రసవంతో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ సురక్షితంగా ఉన్నారని 108 సిబ్బంది సోమవారం పేర్కొన్నారు.

మహిళపై దాడి

పీలేరు : ఓ మహిళపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి బంగారు నగలు అపహరించుకుని వెళ్లిన సంఘటన సోమవారం పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎల్‌బీఎస్ రోడ్డులో నివాసముంటున్న అనసూయమ్మ (60) ఒంటరిగా జీవనం సాగిస్తోంది. గోనెసంచులు, తాడుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం గుర్తుతెలియని దుండగులు ఇంటిలోనికి ప్రవేశించి ఆమె వద్ద నున్న బంగారు నగలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమె ప్రతిఘటించడంతో కత్తితో దాడి చేశారు. సుమారు 80 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకుని వెళ్లారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. రాయచోటి అడిషనల్ ఎస్పీ రాజకమల్, డీఎస్పీ మహబూబ్‌బాషా, సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ నరసింహులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్ సిబ్బందితో సోదాలు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ తెలిపారు.

ఏఎంసీ నిబంధనలకు వ్యతిరేకంగా నూతన డైరెక్టర్ ప్రకటన


మాట్లాడుతున్న డైరెక్టర్ వెస్లీ

మదనపల్లె : సీఎస్ఐ ఆరోగ్యవరం మెడికల్ సెంటర్(ఏఎంసీ) చారిటబుల్, సైంటిఫిక్ సొసైటీగా రిజిస్టర్డ్ అయిన సంస్థ అని, దీనికి ప్రత్యేక బైలాస్, నిబంధనలు, నియమావళి ఉన్నాయని, వీటికి వ్యతిరేకంగా ఏకపక్ష నిర్ణయాలతో రాయలసీమ డయాసిస్ బిషప్ నూతన డైరెక్టర్‌ను ప్రకటించారని డైరెక్టర్ డాక్టర్.బి. వెస్లీ అన్నారు. ఏఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం డైరెక్టర్ వెస్లీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏఎంసీ రిజిస్టర్డ్ సొసైటీలో రాయలసీమ డయాసిస్‌కు చెందిన కొందరు సభ్యులు, రెండు మిషన్ ఆస్పత్రులు, ఏఎంసీకి చెందిన ఇతర సభ్యులు గవర్నింగ్‌బాడీ సభ్యులుగా ఉంటారన్నారు. ఏఎంసీ డైరెక్టర్ అసోసియేషన్, గవర్నింగ్‌బాడీకి ఎక్స్‌అఫిషియో సెక్రటరీగా వ్యవహరిస్తారన్నారు. చర్చ్‌ఆఫ్ సౌత్ ఇండియా రాజ్యాంగం, రాయలసీమ డయాసిస్ రాజ్యాంగం ప్రకారం బిషప్ మెడికల్ బోర్డ్ ఛైర్మన్ కానందున, ఏఎంసీ అసోసియేషన్, గవర్నింగ్‌బాడీకి అధ్యక్షుడిగా ఉండలేరన్నారు. ఇటీవల రాయలసీమ డయాసిస్ బిషప్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఏఎంసీ డైరెక్టర్, ఇతర సభ్యులను, అసోసియేషన్ వ్యవస్థాపకుడైన వేలూరు సీఎంసీ డైరెక్టర్‌ను ఆహ్వానించకుండా స్థానికులైన కొందరితో కలిసి హడావుడిగా నిబంధనలకు వ్యతిరేకంగా నూతన డైరెక్టర్‌ను ప్రకటించారన్నారు. న్యాయపరమైన నిబంధనలు, నియమావళిని పాటించి, ఏఎంసీ అప్పులకు సంబంధించి బాధ్యతలు తీసుకుని డైరెక్టర్ నియామకంపై ప్రకటన చేసి ఉంటే గౌరవంగా తప్పుకునేందుకు తాను ఎప్పటికీ సిద్ధమేనన్నారు. అలాకాకుండా దేశంలోనే క్షయనివారణలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఏఎంసీ(శానిటోరియం) ప్రతిష్ఠ దిగజార్చేలా బిషప్ వ్యవహరించడం ఆవేదన కలిగించిందన్నారు. ఏఎంసీ మెడికల్ కాలేజీ నిర్మాణానికి సంబంధించి అప్పులు ఎక్కువ కావడంతో 2022 మే 16న డాక్టర్.బి.వెస్లీని డైరెక్టర్‌గా కొనసాగించాలని ఏఎంసీ అసోసియేషన్ కమిటీ తీర్మానించిందన్నారు. నేషనల్ హైవే అథారిటీ నుంచి ఏఎంసీకి భూముల విషయంగా పరిహారం రావాల్సి ఉన్నందున వాటితో అప్పులు తీర్చాలని ఎదురుచూస్తున్న తరుణంలో ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌ను వివాదాల్లోకి లాగడం బాధ కలిగించిందన్నారు.

అనాథ వృద్ధురాలి నరకయాతన


ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న గౌరమ్మ

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనాథ వృద్ధురాలు తీవ్ర నరకయాతన పడుతోంది. పీటీఎం మండలం మల్లెల గ్రామంలో ఏప్రిల్ 25న అపస్మారక స్థితిలో పడి ఉన్న అనాథ వృద్ధురాలిని 108 సిబ్బంది మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించి మహిళావార్డుకు తరలించారు. ఆమె తన పేరు గౌరమ్మ(65), ఊరు మల్లెల గ్రామమని చెప్పింది. అనంతరం కోమాలోకి వెళ్లినట్లు ఆస్పత్రి సిబ్బంది చెప్పారు. మతిస్థిమితం సరిగ్గాలేక నరకయాతన పడుతోంది. సంబంధీకులు ఎవరైనా ఉంటే వెంటనే జిల్లా ఆస్పత్రికి రావాలని మెడికల్ సూపరిండెంట్ పద్మాంజలిదేవి కోరారు. అయితే గౌరమ్మ కుటుంబసభ్యులు బాధితురాలిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చి వదిలివెళ్లినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కలికిరి : మండల పరిధిలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని టి.సంద్రావారిపల్లి సమీపంలోని పీలేరు-కడప జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి నడిచి వెళుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో వ్యక్తి ముఖం గుర్తుపట్టడానికి వీలులేకుండా పోవడంతో మృతుని ఆచూకీ లభించలేదు. స్థానికుల సమచారం మేరకు మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదం కలికిరి మండల పరిధిలో చోటు చేసుకోవడంతో సోమవారం అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం కలికిరి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వీఆర్ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి సుమారు 60 ఏళ్ల వయస్సు ఉంటుందని, మృతదేహం పీలేరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచినట్లు పోలీసులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరు అరెస్ట్

బి.కొత్తకోట : గత నెల 19న తండ్రి కొడుకులపై జరిగిన దాడి చేసిన కేసులో వైద్యులు ఇచ్చిన నివేదిక ఆధారంగా హత్యాయత్నంగా మార్పు చేసి సోమవారం ఇద్దరిని అరెస్ట్ చేశామని ఎస్ఐ రామమోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. స్థానిక జ్యోతిచౌక్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద స్థలంలో రామాంజి, ఆతని కుమారుడు కిరణ్‌లు గోడ కడుతుండగా వివాదంలోని భూమి తమ వంశానికి చెందినదని, ఆలయంకు దారి లేకుండా అడ్డంగా గోడ కట్టవద్దంటూ పక్కనే నివాసం ఉంటున్న జితేంద్రరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని ఈ వివాదంలో తలదూర్చిన రెడ్డెప్పరెడ్డి, ఇతని అన్న కొడుకు లోకేష్‌లు రామాంజి, కిరణ్‌లపై దాడిచేశారు. దాడిలో తండ్రికొడుకులు గాయపడటంతో స్థానిక ఆస్పత్రిలో, తర్వాత మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో వైద్యం పొందారు. గాయాలపై వైద్యులు ఇచ్చిన నివేదికతో హత్యాయత్నం కేసుగా మార్చి రెడ్డెప్పరెడ్డి, లోకేష్‌లను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

తేనెటీగల దాడిలో ముగ్గురికి గాయాలు


తీవ్రంగా గాయపడిన గోపాల్‌రెడ్డి

మదనపల్లె : తేనెటీగల దాడిలో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. కోళ్లబైలు పంచాయతీ మాదిగగుంత కనుమ గ్రామానికి చెందిన రైతు గోపాల్‌రెడ్డి(50) తన మనవరాళ్లు హేమలత(12), రాణెమ్మ(10)లతో కలిసి బోరుబావి వద్దకు వెళ్లారు. అక్కడ పని చేసుకుంటుండగా అకస్మాత్తుగా వీరిపై తేనెటీగల గుంపు దాడి చేసింది. తేనెటీగల దాడిలో గోపాల్‌రెడ్డి తీవ్రంగా గాయపడగా, మనవరాళ్లు స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 వాహనంలో బాధితుడ్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గోపాల్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.